www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 నవంబరు 2022
5
ఏలూరు

1న భవన నిర్మాణ కార్మికుల డిమాండ్స్ డే

నిడమర్రు: తమ సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు డిసెంబర్ ఒకటో తేదీన డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు తెలిపారు. ప్రజాసంఘాల భవనంలో నిర్మాణ రంగ కార్మిక సంఘాల నేతలతో ఆయన సోమవారం మాట్లాడారు. డిమాండ్స్ డే సందర్భంగా ఒకటో తేదీన తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను, చట్టాలను తుంగలోకి తొక్కిందని విమర్శించారు. వెంటనే సంక్షేమ బోర్డు, పథకాల అమలు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంక్షేమ బోర్డు నిధులను వైఎస్ఆర్ బీమా పేరుతో రూ.830 కోట్లు, పవర్ ఫైనాన్స్ పేరుతో రూ.450 కోట్లు మళ్లించారన్నారు. వాటిని వెంటనే బోర్డుకు జమ చేయాలని, 1214 మెమోను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

రైతు, వ్యవసాయ కార్మికుల హక్కుల సాధనే
రామంకు నిజమైన నివాళి

మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

'వ్యవసాయ సంక్షోభం-పరిష్కార మార్గాలు' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం, భూమి కోసం రాజీలేని కాలంలో పెద్దఎత్తున పోరాటాలు చేయాలని, అదే రైతాంగ పోరాట యోధుడు ఉద్దరాజు రామంకు నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం స్థానిక ఎంబి సోషల్ క్లబ్‌లో ఉద్దరాజు రామం 28వ వర్థంతి సందర్భంగా 'వ్యవసాయ సంక్షోభం-పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, ఉద్దరాజు రామం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఉద్దరాజు రామం ట్రస్ట్ వైస్ ఛైర్మన్ ఎ.రవి అధ్యక్షత వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా నేటికీ పేదల ఆర్థిక స్థితిగతుల్లో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. కార్పొరేట్లకు, సంపన్నులకు ప్రధాని మోడీ రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నారన్నారు. వ్యవసాయరంగ సంక్షోభానికి పరిష్కారం వెతకాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయంగా మార్చాలని చూస్తున్నాయన్నారు. ఇప్పటికే లక్షల ఎకరాల భూములను పేదల నుండి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. గుజరాత్ మోడల్ అంటూ దేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదంతో నింపేలా మోడీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను సృష్టిస్తూ అన్ని రంగాలను సంక్షోభంలో నెడుతున్నారని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతు, వ్యవసాయ కార్మికుల వెన్ను విరిచేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం బాధాకరమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ సంక్షోభం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడేలా చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు భూమిపై హక్కు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వ్యవసాయ కూలీల స్థితిగతులు రోజురోజుకీ దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదలపై ఆర్థిక భారాలు మోపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. దీనివల్ల దళితులు, పేదలు వెనుకబడిన తరగతులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఉపాధి, నిరుద్యోగం సమస్యలను పరిష్కరించాలని, విద్య వైద్యాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేటు వ్యవసాయాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పెద్దఎత్తున ఐక్య పోరాటాలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ దేశంలో అధిక శాతం జిఎస్‌టి మధ్యతరగతి ప్రజలే చెల్లిస్తున్నారన్నారు. నిజమైన పన్ను చెల్లింపుదారులైన మధ్యతరగతి ప్రజలపై నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భారాలు మోపుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో పంటలకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే వ్యవసాయ రంగం మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ కూలీలకు సరైన కూలి రేట్లు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కనబరుస్తున్నాయని విమర్శించారు. దేశ సంపద సృష్టికర్తలైన వ్యవసాయ కూలీల రక్తం పీలుస్తూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తూ అనుసరిస్తుందని విమర్శించారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.జీవరత్నం, నేతలు వై.నాగేంద్రరావు, తామా ముత్యాలమ్మ తుమ్మల సత్యనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

రూ.10.37 కోట్లు సున్నా వడ్డీ రాయితీ జమ
రూ.68.43 లక్షలు పంట నష్టపరిహారం చెల్లింపు
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మూడో విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథక కింద రూ.10.37 కోట్లు, పెట్టుబడి రాయితీ కింద రూ.11.05 కోట్లు జమ చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. రబీ 2020-21తోపాటు ఖరీఫ్ 2021 సీజన్‌లో లక్ష రూపాయల్లోపు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి అర్హత పొందిన రైతులకు సున్నావడ్డీ రాయితీ, ఖరీఫ్-2022 పంట నష్ట పరిహారాన్ని వర్చువల్ ద్వారా సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతుల ఖాతాలకు జమ చేశారు. కార్యక్రమంలో స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, పెదకడిమికి చెందిన రైతు పర్వతనేని కృష్ణారావు, దెందులూరు మండలం సి.రామవరానికి చెందిన కొత్తపల్లి కుమారి తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ రాయితీ కింద 44,820 మంది రైతుల ఖాతాలకు రూ.10.37 కోట్లు మంజూరు చేశారన్నారు. రబీ 2020-21, ఖరీఫ్ 2021కి సంబంధించి జిల్లావ్యాప్తంగా 899 రైతులకు రూ.68.43 లక్షలు పెట్టుబడి రాయితీని మంజూరు చేశారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంట రుణాలు తీసుకుని సకాలంలో రుణాలు తిరిగి చెల్లించిన రైతులకు వైఎస్ఆర్ సున్నావడ్డీని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దెందులూరు మండలం సి.రామవరానికి చెందిన మహిళా రైతు కొత్తపల్లి కుమారి మాట్లాడుతూ సున్నా వడ్డీ రాయితీ కింద తనకు రూ.2400 జమైందని చెప్పారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోనే తన ఖాతాకు సొమ్ము జమైందన్నారు. డ్వాక్రాలో సభ్యురాలిగా ఉన్నానని, గత ప్రభుత్వ హయాంలో రూ.6.20 లక్షలు బకాయి ఉండగా జగనన్న అదీ మాఫీ చేశారన్నారు. చేయూత కింద 18,700 సహాయం పొందానన్నారు. పెదపాడు మండలం పెదకడిమికి చెందిన పర్వతనేని కృష్ణారావు మాట్లాడుతూ సున్నావడ్డీ రాయితీ కింద 3,900 రాయితీ పొందానన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్షపైనే గతంలో చెల్లించినప్పటికీ రోజులతరబడి ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు డిడి తీసి ఇస్తే వారం, పది రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్ప్రేయర్లు, టార్పాలిన్లు కూడా రైతులకు అందించాలని ఆయన కోరారు.

స్పందన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

230 అర్జీలు స్వీకరణ: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

'స్పందన'లో అందిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. స్పందనలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించడంతోపాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం 230 అర్జీలు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు పాల్గొని అర్జీలను స్వీకరించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

అత్యధిక స్వచ్ఛ గ్రామాలు సాధించాలి

'స్వచ్ఛ సర్వేక్షన్' గ్రామీణ పోటీల్లో జిల్లాను జాతీయ స్థాయిలో నిలిపేలా అత్యధిక స్వచ్ఛ గ్రామాలు సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎంపిడిఒలకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఎంపిడిఒలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో 'స్వచ్ఛ సర్వేక్షన్' గ్రామీణ పోటీలకు సమాయత్తంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'స్వచ్ఛ సర్వేక్షన్' గ్రామీణ కార్యక్రమం ద్వారా జిల్లాలోని సంపూర్ణ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర బృందం మరికొద్ది రోజుల్లో జిల్లాలో పర్యటిస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పూర్తిస్థాయిలో సంపూర్ణ పారిశుధ్య పరిస్థితులు కలిగిన గ్రామాలను 'స్వచ్ఛ సర్వేక్షన్' గ్రామాలుగా ఎంపిక చేసి అవార్డులను అందజేస్తుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే గ్రామాల్లో చేపట్టే పారిశుధ్యం స్పష్టంగా కనపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి మండలం నుండి కనీసం రెండు గ్రామ పంచాయతీలు పాల్గొని అవార్డులు సాధించేలా అధికారులు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. 'స్వచ్ఛ సర్వేక్షన్' కార్యక్రమాన్ని సర్పంచులు, ఎంపిడిఒలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఇన్‌ఛార్జి డిపిఒ మల్లికార్జున్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఎన్‌వివి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


టి.నర్సాపురం: మాట్లాడుతున్న దేవినేని ఉమ

80 శాతం ప్రజలు వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకం
మాజీ ఎంపీ మాగంటి బాబు

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వంపై 80 శాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని మాజీ ఎంపీ, టిడిపి అధినేత మాగంటి బాబు అన్నారు. పట్టణంలో ఈ నెల 30న చంద్రబాబు పర్యటన సందర్భంగా రోడ్‌షో సాగే ప్రాంతాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజా సమస్యలపై టిడిపి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.

టి.నరసాపురం: చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాపురం శివార్లలో టిడిపి మండల నాయకులు అచంట అనిల్ కుమార్ తోటలో సోమవారం కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. వైసిపి నాయకులు పోలవరం నిర్వాసితుల సొమ్ము దోచుకున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పనులు 70 శాతం టిడిపి ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల రామారావు, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ రామకృష్ణ, పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆచంట అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

సాంకేతిక పరిజ్ఞానంతో రెండు గంటల్లోనే ఆచూకీ లభ్యం
బాలికలు ప్రలోభాలకు గురికావొద్దు : పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదృశ్యమైన బాలికల ఆచూకీని సాంకేతిక పరిజ్ఞానంతో రెండు గంటల్లో ఛేదించి వారిని క్షేమంగా తల్లిదండ్రులకు పోలీసులు సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి మాట్లాడుతూ మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు ఈ నెల 26న సాయంత్రం ఆరు గంటల సమయంలో ట్యూషన్‌కు వెళ్లొస్తామని చెప్పి బయల్దేరారన్నారు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారని, ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు తనకు సమాచారం అందించారని, దీనిపై వెంటనే ఏలూరులోని జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించామని చెప్పారు. బాలికల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో జీలుగుమిల్లి సిఐ పర్యవేక్షణలో సెల్ ట్రాకింగ్ ద్వారా బాలికల ఆచూకీ గుర్తించామన్నారు. బాలికలు శ్రీకాళహస్తి వైపు వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న విషయాన్ని నెల్లూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట హైవేలపై ఉన్నటువంటి పోలీస్ అధికారులకు సమాచారం అందించామన్నారు. రేణిగుంట డిఎస్‌పి, సిబ్బంది సదరు విద్యార్థినులను గుర్తించి సమాచారం అందించారని, స్థానిక పోలీసులు వారిని సురక్షితంగా అక్కడ నుంచి తీసుకొచ్చారని తెలిపారు. ఈ ఘటనలో ఫిర్యాదు అందిన రెండు గంటల వ్యవధిలోనే బాలికల ఆచూకీ కనుగొనడం అభినందనీయమన్నారు. బాలికలు ఎటువంటి ప్రలోభాలకు గురి కావొద్దని సూచించారు. దిశ యాప్, సాంకేతిక పరిజ్ఞానం బాలికల ఆచూకీ కనుగొనేందుకు దోహదపడ్డాయన్నారు. బాలికలు రాష్ట్రం దాటి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన స్థానిక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.రాజుకు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేశ్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్, శేఖర్, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి లతా కుమారి

వంతెన నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయింపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి నుంచి పాలచర్ల రాజవరం వెళ్లే మార్గంలో చంద్రమ్మ కాలనీ వాగుపై వంతెన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు కేటాయించినట్లు పంచాయతీరాజ్ డిఇ సీతయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిపి కోర్స పోశమ్మ, జెడ్‌పిటిసి వసంతరావుతో కలిసి వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షల గ్రాంటు వంతెన నిర్మాణానికి కేటాయించారని, దీనికి కలెక్టర్ ఆమోదం లభించగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాస్‌రెడ్డి, నాని పాల్గొన్నారు.

వాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఇ, నేతలు

క్రీడలతో మానసికోల్లాసం : జెసి
జిల్లాస్థాయి సిఎం కప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెదపాడు

క్రీడలు మానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. జగనన్న క్రీడా సంబరాలు-2022లో భాగంగా జిల్లాస్థాయి సిఎం కప్ ప్రైజ్‌మనీ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డిహెచ్.మెహ్రాజ్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ అచ్యుతరావు, ఎం.రంగారావు, చీఫ్ కోచ్ బి.శ్రీనివాస్, పిఇటిలు, పీడీలు పాల్గొన్నారు.

క్రీడాకారులతో జెసి కరచాలనం

తాన్న రంగారావు ధన్యజీవి

సంస్మరణ సభలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

తుది శ్వాస విడిచే వరకు సిపిఎం కార్యకర్తగా పని చేసిన తాన్న రంగారావు ధన్యజీవి అని సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య అన్నారు. సిపిఎం నేత తాన్న రంగారావు సంస్మరణ సభ ఆ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన చోడిదిబ్బలో సోమవారం జరిగింది. సభలో సోమయ్య మాట్లాడుతూ రంగారావు ఈ ప్రాంతంలో సిపిఎం నాయకునిగా చురుగ్గా పని చేశారన్నారు. ఆయన ప్రజా ఉద్యమంలో పని చేయడమే కాకుండా భార్య సింహాచలంను కూడా ప్రోత్సహించి మహిళా సంఘం నేతగా ప్రోత్సహించారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రాంతంలో రౌడీల చేతుల్లో రంగారావు భార్య సింహాచలం వీర మరణం పొందారని గుర్తు చేశారు. రంగారావు నిబద్ధత, క్రమశిక్షణను నేటి తరం కార్యకర్తలు అలవర్చుకోవాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కంది విశ్వనాథం మాట్లాడుతూ రంగారావు అనారోగ్యంతో ఉన్నప్పటికీ ప్రతిసారీ సమాజంలో పరిస్థితులను అడిగి తెలుసుకునే వారన్నారు. మహిళా సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి, చోడిదిబ్బ గ్రంథాలయం నిర్వాహకులు సింహాచలం, చిన్న కుమారుడు భూషణం తదితరులు మాట్లాడారు. ఈ సభలో సిపిఎం నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, పి.ఆదిశేషు, ఎం.ఇస్సాక్, జె.గోపీ, జి.యేసుబాబు, ఐ.దుర్గారావు, జి.కోటేశ్వరరావు, చల్లా పైడయ్య, గౌడ రవి, మీసాల సత్యం, స్థానిక పెద్దలు అల్లం వెంకటేశ్వరరావు, శేఖరు, రంగారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోమయ్య

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి టోకరా
తహశీల్దార్‌ను ఆశ్రయించిన బాధిత రైతులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామంలో ధాన్యం, మొక్కజొన్న పంటను రైతుభరోసా కేంద్రం మాజీ ఉద్యోగికి అమ్మి మోసపోయారు. ఏడు నెలలుగా ఆ ప్రబుద్ధుడు సొమ్ము ఇవ్వకపోవడంతో రైతులు లబోదిబోమంటూ సోమవారం స్థానిక తహశీల్దార్‌ను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చనుబండ ఆర్‌బికెలో కృష్ణా జిల్లా విసన్నపేట మండలం మల్లెల గ్రామానికి చెందిన కె.కిషోర్ కొంతకాలం పని చేసి మానేశాడు. నాటి పరిచయాలతో చనుబండ గ్రామ రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న ఏడు నెలల క్రితం కొనుగోలు చేశాడు. నాటి నుంచి రైతులకు సొమ్ము ఇవ్వకుండా మాయమాటలు చెబుతూ కాలం గడుపుతున్నాడు. ఈ విషయాన్ని బాధిత రైతులు రైతుసంఘం నేతల దృష్టికి తీసుకెళ్లారు. వారు తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు కెవివి.ప్రసాద్, పి.జమలయ్య, తల్లాడ భాస్కరరావు, రామకృష్ణంరాజు, బాధిత రైతులు పాల్గొన్నారు.

లింగ వివక్ష తొలగించేందుకు కృషి అవసరం

ప్రజాశక్తి - పెదపాడు

సమాజంలో లింగ వివక్షత, అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. మండలంలోని వట్లూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మెప్మా పిడీ ఇమ్మాన్యుయేల్ అధ్యక్షతన లింగ ఆధారిత వివక్షత వ్యతిరేకతపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళల పట్ల వివక్షత ప్రదర్శించరాదన్నారు. చట్టాల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ రాజేంద్రప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి మధుసూదనరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిఎంఓ వాసవి, దిశా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ దాసరి మేరియున్నీరాణి, మెప్మా జిల్లా కో-ఆర్డినేటర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

నూతన మెనూను అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూను తప్పనిసరిగా పాటించాలని, యాప్‌లో పెట్టిన హాజరు మేరకు విద్యార్థులకు భోజనం తయారు చేయాలని ఆగిరిపల్లి మండల నూతన స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన డిఎల్‌డిఒ పి.వెంకటరత్నం అన్నారు. సోమవారం ఆయన ఎంఇఒ పి.రత్నకుమార్, హౌసింగ్ ఎఇ ఎస్.అలీముల్లాతో కలిసి ఆగిరిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ రత్నకుమార్ విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.పుష్పలత, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రసాద్‌బాబు, స్టాఫ్ సెక్రటరీ జి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మోషేన్‌రాజు పుట్టినరోజు వేడుక

కొయ్యలగూడెం : శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు పుట్టినరోజు వేడుకలు స్థానిక ప్రధాన సెంటర్‌లోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఎంపిపి గంజిమాల రామారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గంటా శ్రీను, పట్టణ అధ్యక్షులు సంకుకొండ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, ఏఎంసి చైర్‌పర్సన్ దుర్గాప్రసాద్, ఎఎంసి డైరెక్టర్ సోమేశ్వరరావు, బిసి నాయకులు మారిశెట్టి శ్రీను, నాగార్జున, వార్డు మెంబర్ పులపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికకు సైకిల్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బాలికల విద్యను ప్రోత్సహించేందుకు వారధి ట్రస్ట్ అందిస్తున్న ప్రోత్సాహం హర్షణీయమని సామాజికవేత్త కెవిఎస్.ధనకుమార్ అన్నారు. 4వ వార్డు ఇందిరా నగర్ కాలనీ వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల బాలికకు సోమవారం సైకిల్ అందించారు. ఈ సందర్భంగా వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు, నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త తడికమళ్ల రాజశేఖర్ వితరణతో "బాలికావిద్యను" ప్రోత్సహిస్తూ సైకిల్ పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తడికమళ్ల రాజశేఖర్ వితరణతో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వాలీబాల్ క్రీడాకారిణి మాధవరపు కోమలికి సైకిల్ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభినవ కూచిపూడి నాట్య అకాడమీ వ్యవస్థాపకురాలు శీలా రూపాదేవి, మద్దిపాటి శ్రీను, కొత్తపల్లి సురేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

బుట్టాయగూడెం : ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాల మైదానంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి సిఎం కప్ ఆటల పోటీల్లో పోలవరం నియోజకవర్గ జట్టు పాల్గొని విజయం సాధించి జోనల్ స్థాయి సిఎం కప్ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారికి అన్ని విధాలుగా సహకరిస్తూ వారికి కోచింగ్ ఇచ్చిన పీడీ, పిఇటిలను ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జోనల్ స్థాయిలో కూడా విజయం సాధించి ఏజెన్సీ ప్రాంతానికి, పోలవరం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

'శ్రీచైతన్య'లో ఇంగ్లీష్ క్లబ్

చింతలపూడి : నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత వ్యక్తులుగా ఎదగాలన్నా, పరస్పర భావ ప్రసార వినియోగం అభివృద్ధి చెందాలన్నా ఆంగ్లభాషా వాక్పటిమ అవసరమని ఎంటెక్ ఉదయ శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం ఇంగ్లీష్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహం పరుస్తూ ఆంగ్ల సంభాషణలు, స్వీయ పరిచయాలు, ఆంగ్లంలో కథాకథనాలు, ఏకపాత్రాభినయం వంటి పలు కార్యక్రమాలను విద్యార్థులతో చేయించి ప్రదర్శింపచేశారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారథి జోనల్ కోఆర్డినేటర్ ఉదయ భాస్కర్, ఎకడమిక్ డీన్ శ్రీమధుబాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జి రూప్నీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షుగర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

షుగర్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చవ్వ రవికుమార్ అన్నారు. సోమవారం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కిలారి రవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత షుగర్ వ్యాధి ఉచిత పరీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. శిబిరంలో 50 మందికి షుగర్ వ్యాధి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రావూరి నాగరాజు, నాయకులు ఎన్.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

నవంబరు 30వ తేదీన చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి కోరారు. ఈ మేరకు బైక్ ర్యాలీని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, సీనియర్ నాయకులు శ్రీను, పార్టీ ప్రధాన గ్రామ అధ్యక్షులు తాళ్ళూరు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు కసుమర్తి రెడ్డి రాజా రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు స్టే పై వైసిపి లీగల్ సెల్ హర్షం

ఏలూరు అర్బన్ : రాజధాని అమరావతిపై సుప్రీంకోర్టు విచారిస్తూ హైకోర్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆరు నెలల్లోపు రాజధాని నిర్మాణం పూర్తి చేయాలన్న తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై వైసిపి లీగల్ సెల్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు వైసిపి లీగల్ సెల్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ డివి.నారాయణనాయుడు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హై కోర్టు ఇచ్చిన తీర్పులోని మూడు నుంచి ఏడు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చి ప్రతివాదులకు నోటీసులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిపై విచారణ జరుపుతున్న కెఎం.జోసెఫ్, జస్టిస్ బివి.నాగరత్నలకు ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

విద్యార్థి హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇంటర్ విద్యార్థి సిద్ధార్థ హత్య కేసులో నిందితుడు నాగబాబును తడికలపూడి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోట మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన సిద్ధార్థ ఏలూరు డిపాల్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెల 26వ తేదీన కాలేజీ ముగించుకుని ఇంటికి వచ్చి స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో సిద్ధార్థ ఆదే గ్రామానికి చెందిన నాగబాబు కత్తితో వెనుకగా వచ్చి తలపై, నెత్తిపై నరికాడు. దీంతో తీవ్ర గాయాలైన సిద్ధార్థ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నాగబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిందితుడు నాగబాబు మద్యం తాగుతూ అందరితో గొడవలు పడుతూ ఉంటాడు. ఈ క్రమంలోనే ఐదు నెలల క్రితం సిద్ధార్థ తాతని మోసినప్పుడు నాగబాబు అల్లరి చేశాడు. దీంతో సిద్ధార్థ, అతని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి నాగబాబును మందలించారు. గ్రామానికి చెందిన మరో మహిళను కూడా నాగబాబు అల్లరి చేశాడు. అప్పుడు కూడా సిద్ధార్థ నాగబాబును మందలించాడు. దీంతో సిద్ధార్థ పై కక్ష పెంచుకున్న నాగబాబు ఈ నెల 26న స్నేహితులతో ఆడుకుంటున్న సిద్ధార్థపై కత్తితో దాడి చేసి చంపాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జ్యోతిరావు పూలే జీవితం.. ఆదర్శనీయం

పలుచోట్ల వర్ధంతి కార్యక్రమాలు

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో అణగారిన బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు మందిరంలో సోమవారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కలెక్టర్ అన్నారు. పూలే అడుగుజాడల్లో నడిచి సమసమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఎవి.సత్యనారాయణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచెల్ కిషోర్, రజకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య పాల్గొన్నారు.

ముసునూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, నవయుగ వైతాళికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజనాయన పేర్కొన్నారు. లోపూడి గ్రామ సచివాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 70 ఏళ్ల కిందటే సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు, కుల వ్యవస్థ, స్త్రీ అణిచివేత వంటి కార్యక్రమాలపై పోరాడిన సత్య సాధకుడు తొలి సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పేరం కృష్ణ, వైసిపి గ్రామ నాయకులు బి.నరసింహరావు పాల్గొన్నారు.

మండవల్లి : నిరక్ష్యరాశుల జీవితాల్లో అక్షర జ్యోతులు వెలిగించిన జ్ఞానజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, శాస్త్రవేత్త ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. జ్యోతిరావు పూలే 132 వర్ధంతి సందర్భంగా గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, మాణిక్యాలరావు, శ్యామల, అరుణ పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో పిప్పర పంచాయతీ కార్యాలయం వద్ద బిసి నాయకులు గాలి ఏసుబాబు ఆధ్వర్యాన జ్యోతిరావుపూలే 132వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షులు వేముల ఏడుకొండలు, మాజీ సర్పంచి ముగ్గళ్ల అప్పారావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎంపిపి గంజిమాల రామారావు అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో వైసిపి పట్టణ అధ్యక్షులు సంకు కొండ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి రావు పూలే వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గంట శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్ గాడిచార్ల సోమేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఐద్వా నాయకురాలు అనురాధ పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుల ప్రచార కమిటీ కార్యదర్శి సూర్య కుమార్ మాట్లాడారు. పట్టణంలో పిఆర్‌టియు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

బుట్టాయగూడెం : స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపిపి కారం శాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వాణి, ఎపిఎం పద్మ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

గణపవరం : పిప్పర పంచాయతీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) పాల్గొని మాట్లాడారు. నేటి యువతకు పూలే జీవితం ఆదర్శమన్నారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాకర శ్యామ్, దండు రాము, ఎంపిపి దండు వెంకటరామరాజు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మహాత్మ జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి సందర్భంగా ఏలూరు జ్యూట్ మిల్ సెంటర్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) సోమవారం శంకుస్థాపన చేశారు. జనసేన ఆధ్వర్యంలో ఏలూరులోని ఆ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, నగర అధ్యక్షులు కాశిరెడ్డి నరేష్ పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిశీలకులు పత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు, చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ కృష్ణ, టిడిపి ఏలూరు బాధ్యులు బడేటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : జ్యోతిరావుపూలే 132 వర్ధంతిని ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. విగ్రహ కమిటీ అధ్యక్షులు పునేశ్వరరావు, కార్యదర్శి నిమ్మగడ్డ బిక్షాలు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జ్యోతిరావుపూలే విగ్రహానికి ఎంఎల్ఎ ఎలిజా, వైసిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

కైకలూరు రూరల్ : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం పాత కోర్టు ఆవరణలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వరప్రసాద్, నాయకులు పూల రాజీ, గౌరవ అధ్యక్షులు మోదుగుమూడి లక్ష్మయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భలే చిరంజీవి, అచవరం సర్పంచి కట్ట నాగరాజు గౌడ్, బోల్లా శ్యామల రాజు పాల్గొన్నారు.

రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

మహిళల పట్ల రాందేవ్ బాబా చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ జన విజ్ఞాన వేదిక సమతా, ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఏలూరులో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించారు. సమతా రాష్ట్ర కార్యదర్శి తేజశ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రవచనకర్త గరికిపాటి నరసింహరావు మహిళలు వేసుకొనే వస్త్రాలపై వ్యాఖ్యలు చేశారన్నారు. ఇప్పుడు రాందేవ్ బాబా మహిళలు బట్టలు వేసుకున్న, వేసుకోకపోయిన అందంగానే ఉంటారని అన్నారని చెప్పారు. దీన్ని బట్టి చూస్తే ఇటీవల కాలంలో సమాజంలో పెద్ద మనుషులు లాగా చలామణి అవుతున్న వారు ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధంగా విపరీత ధోరణులు వస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో మహిళల పట్ల చులకన భావం పెంచుతున్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్‌లు వి.శైలజ, విజయభాస్కర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా జిల్లా కార్యదర్శి ఐవి.సుధాకర్, విజిఎం ఆర్.కృష్ణారావు, ఐద్వా నాయకులు సిహెచ్. రాజ్యలక్ష్మి, టౌన్ కార్యదర్శి పి.వెంకటరమణ పాల్గొన్నారు.

చింతలపూడి : రామ్‌దేవ్ బాబాని వెంటనే అరెస్టు చేసి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా సభ్యులు మంచెం వరలక్ష్మి అన్నారు. ఈ మేరకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై రామ్‌దేవ్ బాబా చేసిన అనుచిత వ్యాఖ్యలు న్యాయస్థానం సుమోటగా స్వీకరించాలని, మరొవ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయాలంటే భయపడేటట్లు రామ్‌దేవ్‌కు శిక్ష విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.అనురాధ, పి.గోపలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తేజశ్రీదేవి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం వారికి గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు. గ్రేడ్ ఎ రకం క్వింటాళ్లకి రూ.2060, కామన్ రకం క్వింటాళ్లకి రూ.2040 మద్దతు ధర కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ధాన్యం సేకరణకు 20 వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ కాల్నీడి సుబ్బారావు, దాకారపు సూరిబాబు, యర్రా గంగాధరావు, కాల్నీడి రమేష్, కాల్నీడి సత్యనారాయణ, బసవరాజు, సిఇఒ భుజంగరావు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తాటియాకులగూడెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో మొదటి విడతగా మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని సున్న వడ్డీ చెక్కును వ్యవసాయ సంచాలకులు బుజ్జిబాబు ఆధ్వర్యంలో రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్శ పోసమ్మ, జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సర్పంచి రాంబాబు, సొసైటీ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, కుంజ రాముడు, తహశీల్దార్ జి.ఎలీషా, ఎంపిడిఒ మంగతాయారు, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సున్నా వడ్డీ చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తా

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను శాఖా గ్రంథాలయం అభివృద్ధికి సహకరిస్తామని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్, విశాఖపట్నం కె.శివవరప్రసాద్ హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యం రావడానికి ముందు నుంచి గుండుగొలను కేంద్రంగా పనిచేస్తున్న శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. అప్పట్లో శిథిలమైన గ్రంథాలయాన్ని తొలగించి, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆర్ఆర్ఆర్ఎఫ్. (రాజా రామ్మోహన్ రాయ్ ఫౌండేషన్) నిధులతో పున:నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పనితీరు గ్రామస్తుల ఆదరణ ఇతర అంశాలను గ్రంథ పాలకురాలు గారపాటి నాగమణి ఆయనకు వివరించారు. గ్రంథాలయానికి కొన్ని కనీస సౌకర్యాల కల్పన, గ్రంథాలయ మరమ్మతుల కోసం సహకరించాలని గ్రంథ పాలకులతోపాటు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నల్ల శంకర్ జనరల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్ వారి విజ్ఞప్తి మేరకు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరుకు చెందిన యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎంజికె.మూర్తి, గుండుగొలను యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న శివవరప్రసాద్

షష్టి ఉత్సవాలు ప్రారంభం

అన్ని ఏర్పాట్లు పూర్తి : ఆలయ ఛైర్మన్ నాగరాజు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి కళ్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన షష్టి ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారిని పెండ్లి కుమారుని చేయడంతో ప్రారంభమయ్యే షష్టి ఉత్సవాలు డిసెంబర్ పదో తేదీన నిర్వహించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా సింగరాయపాలెం -చేవూరుపాలెం సెంటర్‌లో నాలుగు రోడ్ల కూడలిలో భారీ కటౌట్స్ ఏర్పాటు చేసి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సింగరాయపాలెం సెంటర్‌లో ఆలయం ప్రధాన రహదారిలో ఉండడంతో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని వాహనాలు మళ్లింపు చర్యలు చేపట్టామన్నారు. భక్తుల సౌకర్యార్థం మచిలీపట్నం, గుడివాడ, భీమవరం ఆర్‌టిసి డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఆలయం వద్ద పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు వైద్య సేవలందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. 29వ తేదీ మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు స్వామివారి పుట్టలో పాలు పోసి షష్టి ఉత్సవాలను అధికారికంగా ప్రారంభిస్తారన్నారు. భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకొని షష్టి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఛైర్మన్ నాగరాజు

ఆరోపణలపై ఆరా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

న్యాయం చేయండి అనే శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. ఎస్‌పి కార్యాలయం నుంచి ముదినేపల్లి ఎస్ఐ షణ్ముఖసాయికి ఫోన్ చేసి కిందిస్థాయి అధికారిపై వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. ముదినేపల్లి పోలీసులు చేపల వ్యాపారి రాజమ్మ దుకాణం వద్దకు వెళ్లి చేపలు తక్కువ ధరకు ఇవ్వాలని బెదిరించిన అధికారి ఎవరనే విషయాలు ఆమె మాటల ద్వారా రాబట్టారు. జరిగిన విషయాలన్నీ పోలీసులు సేకరించి ఎస్ఐకి వివరించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా తాను ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల లోపు కింది స్థాయి అధికారిపై ఫిర్యాదు వచ్చిందన్నారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు చెప్పామన్నారు. కిందిస్థాయి అధికారిపై వచ్చిన ఆరోపణలపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని శింగరాయపాలెంలో స్వచ్ఛ సంకల్పంలో భాగంగా సోమవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్తను, వీధుల్లో ఉన్న చెత్తకుప్పలను, మురుగునీరు వంటి వాటిని పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డెరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, గ్రామ సర్పంచి బోయిన విమల, అల్లూరు సర్పంచి, రామకృష్ణ పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'పై అవగాహన

ప్రజాశక్తి - చాట్రాయి

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంపై మండలంలోని మర్లపాలెంలో టిడిపి మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఏలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు.

కైకలూరు రూరల్ : వైసిపి ప్రభుత్వ విధానాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) తెలిపారు. మండలంలోని వదర్లపాడులో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినది

GUTHULA TRIMURTHULU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 09-12-2013న **L5191154** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు లక్ష్మణేశ్వరం గ్రామం నుండి నరసాపురం పట్టణం వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GUTHULA TRIMURTHULU
S/o. G.Simhachalam, D.No. 5-17
Devuni Thota, Lakshmaneswaram Post,
Narasapuram Mandal, W.G.Dist., A.P.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
భీమవరం బ్రాంచ్, జువ్వలపాలెం రోడ్డు, భీమవరం - 534202.
ఫోన్ : 08816-222540, ఇ-మెయిల్ : iob1091@iob.in

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి రూలు 8(6)/ రూలు 9(1) నిబంధనల ప్రకారం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, సెక్షన్ 13(2) ప్రకారం స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించినవిధంగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించటమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో అది, ఎలా ఉన్నది అలా ప్రాతిపదికన"** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తమును కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు ఇ-వేలం" ద్వారా ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది. వెబ్ పోర్టల్ https://iob.auctiontiger.net లో అందించబడిన ఇ-వేలం ఫ్లాట్ ఫామ్ ద్వారా దిగువ సంతకం చేసిన వారి ద్వారా విక్రయం జరుగుతుంది.

1. ఋణగ్రహీత/ తనఖాదారు యొక్క పేరు మరియు చిరునామా : 1) శ్రీమతి కలిదిండి జానకమ్మ, భర్త : వెంకట సత్యనారాయణ రాజు, డి.నెం.19-30, మొగల్తూరు గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా ...... **ఋణగ్రహీత/ తనఖాదారు**
2) శ్రీ కలిదిండి అప్పల రామకృష్ణం రాజు, తండ్రి : వెంకట సత్యనారాయణ రాజు, డి.నెం.19-30, మొగల్తూరు గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా ...... **ఋణగ్రహీత**
ఎన్‌పిఏ తేది : 30.11.2020 **డిమాండ్ నోటీసు తేది : 20.04.2021**
డిమాండ్ నోటీసులో క్లెయిమ్ చేయబడిన బకాయి మొత్తం : తేది.20.04.2021 నాటికి రూ.1,31,00,227/- (అక్షరాలా ఒక కోటి ముప్పై ఒక్క లక్షల రెండు వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే) భవిష్యత్తులో జమకూడు వడ్డీ మరియు ఖర్చులతో కలిపి కట్టవలెను.
స్వాధీనత నోటీసు తేది : 05.01.2022
స్వాధీనత నోటీసులో క్లెయిమ్ చేయబడిన బకాయి మొత్తం : తేది.05.01.2022 నాటికి రూ.1,36,83,602/- (అక్షరాలా ఒక కోటి ముప్పై ఆరు లక్షల ఎనభై మూడు వేల ఆరు వందల రెండు రూపాయలు మాత్రమే) భవిష్యత్తులో జమకూడు వడ్డీ మరియు ఖర్చులతో కలిపి కట్టవలెను.
*స్థానిక ప్రభుత్వ బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు మొ॥నవి) : తెలియదు

తనఖావుంచిన ఆస్తుల వివరములు
(శ్రీమతి కలిదిండి జానకమ్మ పేరున గల ఆస్తి)
(నరసాపురం యస్ఆర్ఓలో తేది.13.04.1975 నాటి దస్తావేజు నెం.1301/1975 క్రింద) పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు పంచాయతి & మండలం, అసెస్‌మెంట్ నెం.2379, 2380 & 2381, ఆర్.యస్.నెం.757/14, డి.నెం.19-30, 19-32 నుండి 33 & 19-31లోగల శ్రీదేవి జానకి డిటియస్ సినిమా థియేటర్ మరియు ఒకే అంతస్థు గల ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ షాపింగ్ కాంప్లెక్స్ & 2 అంతస్థుల ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్థి. **దీనికి హద్దులు : తూర్పు :** హైవే రోడ్డు, **పడమర :** కనకమ్మకి చెందిన భూమి, **ఉత్తరం :** కనకమ్మకి చెందిన భూమి & ఉమ్మడి దారి, **దక్షిణం :** కె. పద్మ యొక్క భూమి & యజమాని యొక్క భూమి.

ఇ-వేలం తేది మరియు సమయం	**తేది.30.12.2022న ఉదయం 11 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు ప్రతి 10 ని.ల పొడిగింపుతో విక్రయం పూర్తయ్యేవరకు**
రిజర్వు ధర	**రూ.3,09,17,000/- (అక్షరాల మూడు కోట్ల తొమ్మిది లక్షల పదిహేడు వేల రూపాయలు మాత్రమే) 1% ట్యాక్స్‌తో కలిపి**
ధరావత్తు సొమ్ము	**రూ.30,91,700/- (అక్షరాల ముప్పై లక్షల తొంభై ఒక్క వేల ఏడు వందల రూపాయలు మాత్రమే) (రిజర్వు ధరలో 10%)**
ఇయమ్‌డి రెమిటెన్స్	EFT / NEFT / RTGS ద్వారా ఈ - ఆక్షన్ సర్పేసీ కరెంట్ అకౌంట్ నెం.109102000002222, ఐఎఫ్‌యస్‌సి కోడ్ IOBA0001091, favouring శ్రీమతి కలిదిండి జానయమ్మ & శ్రీ కలిదిండి అప్పల రామకృష్ణం రాజుల పేరున డిపాజిట్ చేయగలరు. బ్రాంచ్ చిరునామా : ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, డి.నెం.2-1-39, రామ్స్ ప్లాజా, జెపి రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.
బిడ్ పెంపుదల	**రూ.50,000/-**
ఆస్తి తనిఖీ	**తేది.01.12.2022న (ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు) నుండి ప్రారంభం**
ఇయమ్‌డి తో బిడ్ కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తు తేది	**తేది.01.12.2022 ఉదయం 10 గం.ల నుండి ప్రారంభం**
ఇయమ్‌డితో బిడ్ కోసం ఆన్‌లైన్ ధరఖాస్తు సమర్పించడానికి చివరి తేది	**తేది.29.12.2022**
ఎన్‌కంబ్రెన్స్ ఏమైనా ఉన్నచో	**లేదు**
*స్థానిక ప్రభుత్వ బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు మొ॥నవి)	**తెలియదు**

చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.
నియమ నిబంధనల కొరకు దయచేసి చూడండి : ***https://iob.auctiontiger.net***
(ఇ-వేలం యొక్క సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్ పోర్టల్)
ప్రదేశం : భీమవరం, తేది : 28-11-2022 **సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్**